క్లుప్తంగా

కాలేయం ఆరోగ్యంపై అప్రమత్తం

బోట్‌క్లబ్: ఆరోగ్యంలో కాలేయం పాత్ర కీలకమని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ సత్య ఆదిత్య ప్రసన్న అన్నారు. ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక భానుగుడి సెంటర్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. సరైన ఆహారం తీసుకోకపోవడం, అధికంగా మద్యం సేవించడం అధిక బరువు ఉండటం వంటి అనారోగ్యకర అలవాట్లు కాలేయాన్ని దెబ్బతీస్తాయన్నారు. సరైన ఆహారం , జీవనశైలి మార్పులతో కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు గొడుగుల అందజేత



వీధి వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

బాలాజీచెరువు: లయన్స్‌క్లబ్ కాకినాడ డైమండ్ జూబ్లీ వేడుకల్లో భాగంగా ది ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ లయన్స్‌క్లబ్ నగరంలో తోపుడు బండ్ల వ్యాపారస్తులకు శనివారం గొడుగులు అందజేసింది. క్లబ్ జిల్లా పూర్వ గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ వంద మంది వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోదావరి చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు దేగల చంద్రశేఖర్, ఎంవీఆర్ మోహన్‌కుమార్, మేడిశెట్టి వెంకటరమణ, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముట్టడి

బోట్‌క్లబ్: కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు భారదేశాన్ని అధికార దుర్వినియోగంతో దోసుకున్నందుకు నిరసనగా బీజేపీ నాయకులు శనివారం స్థానిక కల్పనా సెంటర్‌లోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయాన్ని ముట్టడించారు. నేషనల్ హెరాల్డ్ స్కాం మనీ లాండరింగ్ కేసు ఈడీ చార్జిషీట్ ఫైల్ చేసిన నేపథ్యంలో దోపిడీకి నిరశనగా బీజేపీ యువమోర్చా జాతీయ నాయకుల పిలుపు మేరకు ముట్టడి చేసినట్లు ఆపార్టీ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గండి కొండలరావు, సింగిలిదేవి సత్తిరాజు, గూటూరి పద్మ, పైడా రవీంద్ర, తుమ్మల పద్మ, జ్యోతుల రాజేష్ పాల్గొన్నారు.

ఆర్‌ఎంసీ క్రీడా ప్రాంగణాన్ని తెరవండి



ఆర్‌ఎంసీ క్రీడా ప్రాంగణం ఎదుట నిరసన చేపట్టిన వాకర్లు

కాకినాడ క్రైం: ఆకతాయిలు చేసిన పనులతో వివాదం చెలరేగి రంగరాయ వైద్య కళాశాల క్రీడా ప్రాంగణాన్ని కొద్ది నెలలుగా పూర్తిగా మూసి వేయడం సరైన నిర్ణయం కాదని వాకర్స్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కళాశాల యాజమన్యానికి వారు విన్నవించారు. ఆరోగ్య పరిరక్షణ కోసం వాకింగ్ చేస్తున్న సీనియర్ సిటిజన్లకు ఈ పరిస్థితి ఇబ్బందికరమన్నారు. రోజంతా తెరవడంలో ఇబ్బందులు ఉంటే కనీసం ఉదయం, సాయంత్రం వేళల్లో రెండు గంటల చొప్పున క్రీడా ప్రాంగణాన్ని తెరవాలని కోరారు. ఈ మేరకు ఆర్‌ఎంసీ మైదానం ఎదుట నిరసన చేపట్టారు.

హిందువులపై దాడులు అరికట్టాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న బీజేపీ, వీహెచ్‌పీ నాయకులు

కాకినాడ సిటీ: పశ్చిమబెంగాల్‌లో హిందువులపై దాడులు అరికట్టాలని కోరుతూ కాకినాడలో కలెక్టరేట్ ఎదుట వీహెచ్‌పీ, బీజేపీల ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఆందోళనకారులు ముందుగా బాలాజీచెరువు సెంటర్ నుంచి ర్యాలీగా బయలుదేరి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చి ధర్నా చేశారు. రాష్ట్రంలో హిందువులపై దాడులు అరికట్టాలని, సీఎం మమతా బెనర్జీ రాజీనామా చేయాలని, ఆ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, బీజేపీ, వీహెచ్‌పీ నాయకులు తుమ్మల పద్మజ, సాలగ్రామ లక్ష్మీప్రసన్న, చెక్కా రమేష్, సింగలిదేవి సత్తిరాజు, కవికొండల భీమశంకర్, దొడ్డి వీరేంద్ర, బొలిశెట్టి ప్రసాద్, శంకర్‌సింగ్, రంబాల వెంకటేశ్వరరావు, గొరకపూడి చిన్నయ్యదొర, గాలిదేవర శేఖర్, ఏలూరి కృష్ణ, వెలుగుల గోపాలకృష్ణ పాల్గొన్నారు.

పోటునీటితో పొలాలకు ముప్పు

- ఎల్లేటి తూముల ఫాలింగ్ షట్టర్లు ధ్వంసం
- మరమ్మతులను పట్టించుకోని అధికారులు
- చౌడుబారుతున్న భూములు
- బాగు చేయించాలని రైతుల వినతి



శహపురం డ్రెయిన్‌పై ఎల్లేటితూముల వద్ద శిథిలమైన ఇనుప తలుపులు

కరప: తుల్యభాగలో కలిసే శహపురం డ్రెయిన్‌పై ఉండే ఎల్లేటి తూములు శిథిలమయ్యాయి. సముద్రం పోటు నీటికి పంటపొలాలు చౌడుబారిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శహపురం డ్రెయిన్‌పై ఉన్న ఎల్లేటి తూములు (ఫాలింగ్ షెట్టర్స్) శిథిలావస్థకు చేరినా మరమ్మతులు చేయకపోవడంవల్లే సారవంతమైన పంటపొలాలు చౌడుబారుతున్నాయని రైతులు అంటున్నారు. సముద్రం నుంచి వచ్చే పోటు నీరు డ్రెయిన్‌లోకి రాకుండా అడ్డుకునే ఎల్లేటి తూములు దెబ్బతిన్నా పట్టించుకోని అధికారుల పనితీరుపై రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. రెండు మండలాలలోని పంటపొలాల్లోని మురుగు నీరు, వర్షం వల్ల వచ్చే ముంపు నీరు శహపురం డ్రెయిన్ ద్వారా ప్రవహించి గొర్రిపూడి సమీపంలో తుల్యభాగ డ్రెయిన్‌లో కలుస్తోంది. పెదపూడి మండలంలోని శహపురం, కాండ్రేగుల, కరప మండలంలోని పేపకాయలపాలెం, కరప, వలసపాకల, వేములవాడ, పాతర్లగడ్డ గ్రామాల్లోని పంటపొలాలు శహపురం డ్రెయిన్ పరిధిలోకి వస్తాయి. శహపురం నుంచి గొర్రిపూడి వరకు ఈ డ్రెయిన్ 8.25 కిలోమీటర్లు ఉంటుంది. సుమారు 2,500 ఎకరాల్లోని మురుగు, ముంపు నీరు ఈ డ్రెయిన్ ద్వారా ప్రవహించి, తుల్యభాగ డ్రెయిన్‌లో కలుస్తుంది. అమావాస్య సమయంలో సముద్రం నుంచి వచ్చే పోటు నీరు శహపురం డ్రెయిన్‌లోకి రాకుండా ఉండేందుకు గొర్రిపూడి వద్ద ఐదు తూములకు ఫాలింగ్ షట్టర్స్ (నీటి ప్రవాహాన్ని బట్టి వాటంతట అవే తెరుచుకుని మూసుకుని పోయే తలుపులు) బ్రిటిష కాలంలో ఏర్పాటు చేశారు. వాటినే రైతులు ఎల్లేటి తూములుగా పిలుస్తున్నారు. ఐదు కానాలుగా విభజించి వాటికి షట్టర్స్ అమర్చి పై నుంచి రహదారి కోసం వంతెన నిర్మించారు. శహపురం డ్రెయిన్‌లో నీటి ప్రవాహం ఎక్కువగా వస్తున్నప్పుడు ఈ షెట్టర్లు ఆటోమేటిక్‌గా తెరుచుకుని తుల్యభాగ డ్రెయిన్‌లో కలసి పటవల వద్ద సముద్రంలో కలుస్తున్నాయి. అమావాస్య సమయంలో సముద్రం పోటునీరు ప్రవాహానికి ఈ షట్టర్స్ మూసుకుపోయి నీటిని కాలువలోకి రాకుండా చేస్తాయి. ఇనుప తలుపులు తుప్పు పట్టి పూర్తిగా శిథిలమయ్యాయి. దీంతో పోటునీరు డ్రెయిన్‌లోకి వచ్చి చేరుతోంది. ఈ నీటి వల్ల సారవంతమైన పంటపొలాలు చౌడుబారిపోతున్నాయని రైతులు అంటున్నారు. కరప, పాతర్లగడ్డ, వేములవాడ, వలసపాకల గ్రామాలకు సంబంధించి సుమారు 1,500 ఎకరాలు పోటునీటి వల్ల ఉప్పు కయ్యలుగా మారుతున్నాయని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. పోటునీటి వల్ల సారవంతమైన భూములు దెబ్బతినడమే కాకుండా ఎకరానికి ఐదారు బస్తాలు దిగుబడిని ప్రతిపంటకు కోల్పోవాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. శహపురం డ్రెయిన్‌పై ఉన్న ఎల్లేటి తూములను బాగు చేయించి, కొత్త తలుపులు అమర్చాలని రైతులు కోరుతున్నారు.

కొత్త తలుపులు అమర్చాలి



తుల్యభాగ డ్రెయిన్‌లో కలిసే శహపురం డ్రెయిన్‌పై ఉండే ఎల్లేటి తూములకు ఉండే ఇనుప తలుపులు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీనివల్ల సముద్రం పోటునీరు శహపురం డ్రెయిన్‌కు దానినుంచి పంటపొలాలకు చేరుతోంది. పోటునీటికి పంటలు పండక రైతులు నష్టపోతున్నారు. మురుగు నీటి పారుదలశాఖ అధికారులు స్పందించి ఎల్లేటి తూములకు కొత్త ఇనప తలుపు అమర్చేందుకు చర్యలు తీసుకోవాలి.

– నక్కా వీరభద్రరావు, రైతు, కరప

పంటపొలాలు చౌడుదేరుతున్నాయి



శహపురం డ్రెయిన్‌పై ఉండే ఎల్లేటితూములు పూర్తిగా ధ్వంసమయ్యాయి. సముద్రం పోటునీరు పంట పొలాల్లోకి చేరడం వల్ల సారవంతమైన భూములు చౌడుబారిపోతున్నాయి. పంటభూములు దెబ్బతినడం వల్ల దిగుబడులు తగ్గి నష్టపోతున్నాం. రైతుల ఇబ్బందులను గమనించి ఎల్లేటి తూములు బాగుచేయించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బండే వీరబాబు, రైతు, వేములవాడ.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

కరప: 2025–26 విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు లాటరీ పద్ధతిలో ఉచితంగా కేటాయించేందుకు మార్గదర్శకాలతో కూడిన షెడ్యూల్ విడుదలైనట్టు ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణలు తెలిపారు. కరపలో శనివారం ఎంఈఓలు స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఈ నెల 26వ తేదీలోగా సచివాలయాల ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలని, 28వ తేదీ నుంచి విద్యార్థులు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని వివరించారు. ఎవరికైనా సందేహాలుంటే మండల విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని ఎంఈఓలు సూచించారు.

సరిహద్దు తగాదాలో మహిళకు గాయాలు

కరప: సరిహద్దు విషయమై ఇద్దరు మహిళల మధ్య జరిగిన కొట్లాటలో ఒకరికి తీవ్ర గాయాలై కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతోంది. పోలీసుల కథనం మేరకు మండలం గొర్రిపూడి గ్రామంలో పడాల రంగమ్మ, గండి వెంకటలక్ష్మిల మధ్య తరచుగా సరిహద్దు గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 18వ తేదీన సాయంత్రం రంగమ్మ, వెంకటలక్ష్మిల మధ్య మళ్లీ సరిహద్దు విషయమై గొడవపడ్డారు. ఈ ఘర్షణలో వెంకటలక్ష్మి చెక్కబద్దతో రంగమ్మ తలపైన కొట్టగా తప్పించుకునే ప్రయత్నంలో ముఖంమీద, ఎడమ కనుబొమ్మపైన రక్తపు గాయమైంది. ఆమెను వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా చికిత్సపొందుతోంది. బాధితురాలు శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అధికారుల తీరు బాగోలేదు

- నగరంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానం
- ఎమ్మెల్యే వనమాడి కొండబాబు



ఎమ్మెల్యే వ్యాఖ్యలకు బదులిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ భావన

బోట్‌క్లబ్: నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం వేదిక నగరపాలక సంస్థ కమిషనర్ భావన, సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మధ్య విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్రలో పాల్గొన్న ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నగరంలోని ప్రధాన డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో ప్రధాన డ్రైనేజీలన్నీ అధ్వానంగా దర్శనమిస్తున్నాయన్నారు. దీనిపై కార్పొరేషన్ అధికారులు దృష్టి సారించాలని అధికారుల పనితీరుపై బాహ్యంగానే చెప్పారు. ఈ విషయమై కమిషనర్ తక్షణమే స్పందిస్తూ ఇప్పటికే నగరంలోని ప్రధాన డ్రైనేజీల్లో సిల్ట్ తొలగించేందుకు రూ.కోటిన్నరతో టెండర్లను ఖరారు చేశామని, నిత్యం ఉదయాన్నే శానిటేషన్ నిర్వహణ పనులను కూడా తాను పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. దీంతో ఎమ్మెల్యే కమిషనర్ మధ్య ఉన్న విభేదాలు బహిర్గతమైనట్టు అయ్యింది.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



అగ్నిప్రమాదాలు-నివారణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కాకినాడ రూరల్: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి వీరభద్ర రావు పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ కార్యాలయంలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణ పై అవగాహన సదస్సు నిర్వహించారు. సంస్థ భద్రత అధికారి ఎంవీఆర్ మోహన్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 20 వరకు వారోత్సవాలలో భాగంగా తమ సంస్థ తరపున అగ్ని ప్రమాదాల నివారణపై కాకినాడ పరిసర ప్రాంతాలలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. అగ్నిమాపక అధికారి ఎస్. వీరభద్ర రావు వంటగ్యాస్ ప్రమాదాలు, విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించి ఏ విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఫైర్ మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, విజయలక్ష్మి, సుశీల, తులసి తదితరులు పాల్గొన్నారు.

సొంత వైద్యం ప్రమాదకరం

బోట్‌క్లబ్: వైవాహిక జీవితం, జీవన విధానంలో సొంత వైద్యాన్ని ఆచరించడం ప్రమాదకరమని ప్రముఖ వైద్యుడు టీవీకే కార్తిక్ హరీన్ అన్నారు. రోటరీ గోల్డెన్ జుబ్లీక్లబ్ సమావేశం స్థానిక రోటరీ హాల్లో శనివారం నిర్వహించారు. వైద్యులు కార్తిక్ మగవారి లైంగిక ఆరోగ్యంపై మాట్లాడుతూ పొగ తాగడం, మద్యం సేవించడం వంటి వ్యసనాలకు మగవారు దూరంగా ఉండాలన్నారు. మంచి ఆహారపు అలవాట్లు, సరైన వ్యాయామం ద్వారా చక్కని ఆరోగ్యం పొందవచ్చని సూచించారు. అనంతరం రోటరీ మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్ రావు, అసిస్టెంట్ గవర్నర్ ధనసాగర్ ప్రసాద్, సభ్యులు కార్తిక్‌ను సత్కరించారు.

ఈస్టర్ పండుగకు సర్వం సిద్ధం

- ముస్తాబైన క్రైస్తవ శ్మశాన వాటికలు
- ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి



ఈస్టర్ సందర్భంగా సాంబమూర్తినగర్ క్రైస్తవ శ్మశాన వాటికలో శుభ్రం చేసిన సమాధులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఈస్టర్ క్రైస్తవులకు ముఖ్యమైన పండుగల్లో ఒకటి. క్రీస్తు పునరుత్థానాన్ని ఆ మత విశ్వాసులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ఆదివారం ఈ పండుగను జరుపుకోవడానికి నగరంలోని చర్చిలు సిద్ధమయ్యాయి. ఇప్పటికే క్రైస్తవ శ్మశాన వాటికలను రంగులతో అలంకరించారు. ఈస్టర్ రోజు తెల్లవారుజామున 4 గంటల నుంచి వారి పెద్దల సమాధుల వద్ద క్రైస్తవులు పెద్ద సంఖ్యలో చేరుకుని కొవ్వత్తులు వెలిగించి, సమాధులను పూలతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. అనంతరం ఇంటికి వచ్చి కొత్త దుస్తులు ధరించి ఈస్టర్ ప్రత్యేక ఆరాధనకు హాజరై పాప పరిహారం నిమిత్తం ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. నగరంలో సాంబమూర్తి నగర్, డైరీఫాం సెంటర్, రమణయ్యపేట, గైగోలుపాడు ప్రాంతాల్లో క్రైస్తవ సమాధులను శనివారం ముస్తాబుచేశారు.

నగరంలో అర్బన్ ఎంఆర్ఓ భవన్ సమీపంలోని క్రేగ్ మెమోరియల్ బాప్టిస్టు చర్చి, రామారావుపేటలోని సెయింట్ లూథరన్ చర్చి, గాంధీనగర్‌లోని హౌస్ ఆఫ్ ప్రేయర్, ఆంధ్రా బాప్టిస్టు చర్చి, జగన్నాథపురంలోని సెంటినరీ బాప్టిస్టు చర్చి, రోమన్ కేథలిక్ చర్చి, చీడీల పొరలోని షాలోమ్ ప్రేయర్ హౌస్, రిజర్వ్‌లైన్స్ పోలీస్ క్వార్టర్స్ బాప్టిస్టు చర్చి, ఏపీఎస్పీ యూనియన్ బాప్టిస్టు చర్చి, పీస్‌మేకర్స్ మినిస్ట్రీస్ చర్చి ఆధ్వర్యంలో, క్రేగ్ ఇమ్మానుయేల్ చర్చిలలో ఈస్టర్ పండుగ ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లుపూర్తయ్యాయి. పెద్ద సంఖ్యలో క్రైస్తవులు ఈ ప్రార్థనల్లో పాల్గొననున్నారు.

ఘనంగా రన్ ఫర్ జీసస్

ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈస్టర్ పండగను పురస్కరించుకుని శనివారం నగరంలో రన్ ఫర్ జీసెస్ నిర్వహించారు. ఏఐసీసీ జిల్లా శాఖ అధ్యక్షుడు రిక్కి గూటం కార్యక్రమానికి అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ముఖ్య అతిథిగా హాజరై రన్ ప్రారంభించారు. క్రీస్తు మార్గంలో ప్రతి ఒక్కరూ నడచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. క్రైస్తవులకు అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. రిక్కి గూటం మాట్లాడుతూ ఏఐసీసీ ఆధ్వర్యంలో ఏటా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఏల్చూరి పాపారావు, జ్యోతి రెడ్డి కుమార్, సీటీసీ విలియమ్స్, మూర్తిరాజు, జోసఫ్ బెన్ని తదితరులు ర్యాలీని ఉద్దేశించి మాట్లాడి ప్రార్థనలు చేశారు. అనంతరం శాంతి కపోతాలను గాలిలోకి వదిలి రన్‌ను ప్రారంభించారు. ఈ రన్ భానుగుడి నుంచి మెక్లారిన్ గ్రౌండ్స్ వరకు కొనసాగింది. ఏఎస్పీ పాటిల్, సీఐ అప్పల నాయుడు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ రన్‌లో క్రైస్తవ సంఘాల అసోసియేషన్ల నాయకులు, సంఘ సభ్యులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రన్ ఫర్ జీసస్‌లో పాల్గొన్న క్రైస్తవ సంఘ నాయకులు, విశ్వాసులు

ప్రకృతి సాగుతో నాణ్యమైన దిగుబడి

కరప: ఆరోగ్యకరమైన, నాణ్యమైన దిగుబడులు సాధించాలంటే రైతులు రసాయనిక వ్యవసాయాన్ని వదిలిపెట్టి ప్రకృతి సాగు చేపట్టాలని ఆ శాఖ ఎంటీ ధనలక్ష్మి కోరారు. మండలం పెద్దాపురప్పాడులో శనివారం రైతులు, వీఓఏలు, వీపీఏలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రబీ మాసూళ్లు పూర్తయిన తర్వాత పీఎండీఎస్ విత్తనాలు చల్లితే భూములు సారవంతమవుతాయన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఐదుగురు రైతులను గ్రామస్తులతో కలసి ఆమె సత్కరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. వీఆర్వో డి.భరణికుమార్, పంచాయతీ కార్యదర్శి పి.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ చైత్ర మాసోత్సవాలు ప్రారంభం



కనకదుర్గ అమ్మవారి ఆలయంలో లక్ష కుంకుమార్చన చేస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి తొలిపాంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారి చైత్రమాస జాతర మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారి ఆలయంలో పండితులు కలశస్థాపన, మండపారాధన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు రుత్విక్కులకు దీక్షా వస్త్రాలను పంపిణీ చేశారు. అనంతరం రుత్విక్కులు లక్ష కుంకుమార్చన నిర్వహించారు. 11 గంటలకు అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ నెల 27న చైత్ర అమావాస్య వరకూ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు అమ్మవారికి లక్ష కుంకుమార్చన, రాత్రి ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు గరగల సంబరం నిర్వహిస్తామని వివరించారు. వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, గంగాధరబట్ల గంగబాబు, యనమండ్ర శర్మ, ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు, పురోహితులు పాలంకి పట్టాభి, అర్చకులు చిట్టెం హరగోపాల్, దత్తాత్రేయశర్మ పాల్గొన్నారు.

ఈ-వ్యర్థాలు మానవాళికి హానికరం

- జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి త్రినాథ్



కరపలో ఈ-వ్యర్థాలపై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు, సర్పంచ్

కాకినాడ సిటీ: ప్రతినెల మూడో శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం ఉదయం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించారు. జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి పి.త్రినాథ్, కలెక్టరేట్ సిబ్బందితో కలిసి వివిధ విభాగాల్లోని ఈ-వ్యర్థాలను సేకరించి శుభ్రం చేశారు. పర్యావరణానికి ఈ-వ్యర్థాలతో పొంచి ఉన్న ప్రమాదం గుర్తించి వాటి బారి నుంచి తప్పించుకునేందుకు ఈ వ్యర్థాలను అన్నింటిని సేకరించే వారికి అప్పగించారు. సీపీవో పి.త్రినాథ్ మాట్లాడుతూ ఉపయోగించని ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ వస్తువులు కార్యాలయాల్లో, నివాసముండే ప్రాంతాల్లో ఎక్కువ రోజులు ఉంచడం హానికరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు ఈ-వ్యర్థాలపై ప్రతిఒక్కరికి అవగాహన పెంపొందించే లక్ష్యంతో సిబ్బందితో మానవహారం నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ రామమోహన్‌రావు, కలెక్టరేట్ వివిధ విభాగాల అధిపతులు, పౌరసరఫరాలు, వికాస కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో..

కాకినాడ రూరల్: తిమ్మాపురం గ్రామం అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో విద్యార్థులు, అధ్యాపకులు శనివారం కంప్యూటర్ ల్యాబ్‌లు, ప్రయోగ శాలలు, పాత రికార్డుల గదుల నుంచి ఈ-వేస్ట్‌ను సేకరించారు. ఆయా గదుల్లోని పాత కంప్యూటర్లు, మౌస్‌లు, కీ బోర్డులు, ఛార్జర్లు, తదితర వాటిని సేకరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టరు హరిబాబు, అప్పారావు, శ్రీదేవి, మధు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరపలో..

కరప: ఎలక్ట్రానిక్ వ్యర్థాలు ఆరోగ్యానికి హానికరమని, పనిచేయని వస్తువులను పంచాయతీ సిబ్బందికి అందజేయాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎస్వీ శ్రీనివాసరావు అన్నారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కరపలో సర్పంచ్ సాదే ఆజ్యోతి, ఇన్‌ఛార్జ్ కార్యదర్శి పీఎస్‌ఆర్ బ్రహ్మాజీ, పంచాయతీ సిబ్బందితో కలిసి ఈ-వ్యర్థాల సేకరణ చేపట్టారు. అనంతరం గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించి, ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు పెనుగుదురు, వేళంగి, వేములవాడ తదితర గ్రామాల్లో పర్యటించి ఈ-వ్యర్థాల సేకరణపై పంచాయతీ సిబ్బందికి అవగాహన కల్పించారు.

పెనుమర్తిలో..

కాకినాడ రూరల్: మండలంలోని పెనుమర్తి గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్ వద్ద కాకినాడ రూరల్ ప్రాజెక్ట్ సీడీపీఓ వై.లక్ష్మి ఆధ్వర్యంలో ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారి శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ పెంకే ఆనందరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మశ్రీ, వీఆర్వో రామకృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వివిధ కార్యాలయాల్లో..

కాకినాడ క్రైం: జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ బిందుమాధవ్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ భారత కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కార్యాలయం ఆవరణలో ఉన్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించి రీసైక్లింగ్‌కు తరలించారు. అలాగే జీజీహెచ్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ ఆధ్వర్యంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, అధికారులు స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేసి ఆసుపత్రిలో ఈ వ్యర్థాలను సేకరించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో డీఎంహెచ్‌వో నరసింహ నాయక్ ఆధ్వర్యంలో కార్యాలయ ఆవరణలో సిబ్బందితో కలిసి స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు.



కార్యక్రమంలో భాగంగా మానవహారంగా నిలబడిన కలెక్టరేట్ సిబ్బంది



డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

ఈ గ్యాడ్జెట్ల రీసైక్లింగ్ అవశ్యం



ఈ-వ్యర్థాల నిర్వహణపై మాట్లాడుతున్న డాక్టర్ నరసింహం

- రంగరాయ వైద్య కళాశాలలో సదస్సు

కాకినాడ క్రైం: వినియోగించని ఈ-వ్యర్థాలతో భావితరానికి అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని, ఆ పరిస్థితులకు అనుగుణంగా ముందే చికిత్సా పద్ధతులను కనుగొనాల్సిన ఆవశ్యకత మేధావులు సూచిస్తున్నారు. స్థానిక రంగరాయ వైద్య కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ అధ్యక్షతన రీ సైకిల్ యువర్ ఈ-వేస్టేజ్ పేరున సదస్సు నిర్వహించారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జరిగిన ఈ సదస్సుకి ముఖ్య అతిథిగా డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ, ఏపి డీఎంఈ, ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం హాజరుకాగా, గౌరవ అతిథులుగా స్థానిక ఎంఎల్‌ఏ వనమాడి వెంకటేశ్వరరావు, ఎంఎల్‌సీ పేరాబత్తుల రాజశేఖరం, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, జీజీహెచ్ అడ్వయిజరీ కమిటీ సభ్యుడు డాక్టర్ కొండమూరి సత్యనారాయణ పాల్గొన్నారు. డాక్టర్ నరసింహం మాట్లాడుతూ ఈ-వ్యర్థాల నిర్వహణ మానవాళితో పాటు పర్యావరణ పరిరక్షణకు అత్యంత కీలకమైనదన్నారు.

రీసైకిలింగ్ విధానం ద్వారా ఎలక్ట్రానిక్ పరికరాలను పునర్వినియోగించే మార్గాలను అనుసరించాలన్నారు. అనుమతిచ్చిన కేంద్రాలలోనే ఈ-వ్యర్థాలను విడిచిపెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా జీజీహెచ్‌లో సమస్యలను నాయకులకు వివరించారు. పాత బ్లాకుల స్థానంలో కొత్త బ్లాకులు నిర్మించాలని అన్నారు.

టీబీ ఆసుపత్రి పాడుబడి రోగులకు సేవలందించడంలో తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయని, ఎంసీహెచ్ బ్లాక్‌ని రామ్‌కోశ బృందం నిర్మిస్తున్నా పరికరాల సమకూర్చాల్సిన అవసరం ఉందన్నారు. వైద్య విద్యార్థుల వసతి గృహాలు నిర్మాణం పూర్తిగా నిలిచిపోయాయని సదరు సమస్యల పరిష్కరించి రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేందుకు, అలాగే వైద్య విద్యార్థుల చదువు సక్రమంగా సాగేందుకు దోహదపడాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్‌ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ (అకడమిక్స్) డాక్టర్ శశి, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ ఎంపిఆర్ విఠల్, డాక్టర్ శ్రీనివాసన్, ఫోరెన్సిక్ హెచ్‌వోడీ డాక్టర్ ఉమామహేశ్వరరావు సహా వైద్య, నర్సింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.